అభివృద్ధి పథంలో చూచుకొండ



రూ.12 లక్షలతో నిర్మించిన దోబీఖానా



కల్యాణ మండపానికి భూమి పూజ చేస్తున్న ఎంపీ డాక్టర్ సత్యవతి, ఎమ్మెల్యే రమణమూర్తిరాజు(ఫైల్)



రూ.48 లక్షలతో నిర్మించిన చూచుకొండ రామగిరి రోడ్డు

- రహదారులు, కల్యాణ మండపం నిర్మాణానికి నిధులు
- మండలంలో సమస్యల పరిష్కారానికి ఎంపీ సత్యవతి చేయూత

మునగపాక : ఏళ్ల తరబడి సమస్యలతో సహవాసం చేసిన చూచుకొండ గ్రామంలో ఇపుడు అభివృద్ధి వెలుగులు ప్రసరిస్తున్నాయి. రహదారులు, సోలార్ వెలుగులు, మౌలిక వసతుల కల్పనకు విరివిగా నిధులు మంజూరు కావడంతో గ్రామావృద్ధికి బాటలు పడుతున్నాయి. ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే రమణమూర్తిరాజు కృషితో మండలంలో సమస్యలు పరిష్కారానికి నోచుకుంటున్నాయి.

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు

ఏళ్ల తరబడి రహదారి సమస్యగా ఉన్న చూచుకొండ నుంచి రామగిరికి రూ.48 లక్షలతో రహదారి నిర్మించారు. రూ.12 లక్షలతో రజకుల సౌకర్యార్థం దోబీఖానా నిర్మించారు. శ్మశానవాటిక అభివృద్ధిలో భాగంగా రూ.5 లక్షలతో ప్రహరీ గోడ నిర్మించారు. ఇలా ఉండగా గ్రామంలో వివాహ, శుభ కార్యక్రమాలు నిర్వహించేందుకు సరైన సదుపాయాలు ఇంతవరకూ లేవు. ఈ నేపథ్యంలో ఎంపీ సత్యవతి ఇటీవల ఎమ్మెల్యే రమణమూర్తిరాజుతో కలిసి రూ.50 లక్షల వ్యయంతో కల్యాణమండపం నిర్మించేందుకు భూమి పూజ చేశారు. గ్రామానికి వెలుగులు అందించాలన్న ఉద్దేశ్యంతో 120 సోలార్ దీపాలు అందుబాటులోకి తీసుకువచ్చారు. చూచుకొండ–గణపర్తి గ్రామాల మధ్య ముంపు సమస్య రాకుండా రోలు గెడ్డ రక్షణగోడ నిర్మించేందుకు ముందుకొచ్చారు.

ఎంపీ సత్యవతి చొరవ.. దత్తత గ్రామంతో పోటీ

గత టీడీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురైన చూచుకొండ గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి చొరవ చూపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడంతో పాటు గ్రామాభివృద్ధికి అవసరమయ్యే నిధులు మంజూరు చేసి చూచుకొండను ఆదర్శంగా రూపుదిద్దడానికి కృషి చేస్తున్నారు. ఆమె జిల్లాలోని పలు గ్రామాలను దత్తత గ్రామాలుగా ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా మునగపాక మండలం గణపర్తిని దత్తత గ్రామంగా ఎంపిక చేసి ఇప్పటికే కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేస్తున్నారు. ఇపుడు గణపర్తికి పక్కనే ఉన్న చూచుకొండపై కూడా దృష్టి సారించి గ్రామాభివృద్ధికి సహకారం అందిస్తున్నారు.

కల్యాణ మండపం నిర్మాణం హర్షణీయం



చూచుకొండలో శుభ కార్యక్రమాలకు అనువైన స్థలం లేదు. దీంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కల్యాణమండపం నిర్మించేందుకు నిధులు మంజూరుకావడం హర్షణీయం. పనులు వేగవంతం చేసి అందుబాటులోకి వచ్చేలా చూడాలి.

–పెంటకోట సత్యనారాయణ, చూచుకొండ

సోలార్ వెలుగులు భేష్



చూచుకొండ గ్రామానికి అవసరమయ్యే మౌలిక సదుపాయాలు కల్పించడం సంతోషకరం. సోలార్ దీపాలతో పాటు రజకులకు దోబీఖానా ఏర్పాటు చేయడం శుభపరిణామం. గ్రామంలో సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు చూపుతున్న చొరవ అభినందనీయం.

–పి. సూర్యకాంతం, చూచుకొండ

దశల వారీగా అభివృద్ధి పనులు పూర్తి



ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నా. చూచుకొండ అభివృద్ధికి అవసరమయ్యే నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటున్నాం. ఎమ్మెల్యే రమణమూర్తిరాజు సహకారంతో మునగపాక మండలం అభివృద్ధి పథంలో పయనించేలా కృషి చేస్తున్నాం. చూచుకొండకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలను దశల వారీగా కల్పిస్తా.

–డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి, అనకాపల్లి ఎంపీ

చెప్పింది చేసే సత్తా జగన్‌కే ఉంది

ఎమ్మెల్యే గొల్ల బాబూరావు



చినతీనార్లలో గడప గడపకు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి : చంద్రబాబు మాయమాటలు నమ్మితే మరో ఐదేళ్లు మోసపోతారని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. శుక్రవారం చినతీనార్లలో గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాలను కరపత్రాల ద్వారా తెలియజేశారు. ఈ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ప్రజలు అడక్కుండానే వారికి అవసరమైన సంక్షేమ పథకాలను మేనిఫెస్టోలో చేర్చి అమలు చేసిన ఘనత జగన్మోహన్‌రెడ్డి దేనన్నారు. ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చారన్నారు. తమ ప్రభుత్వం వల్ల ప్రతి గడపలోను లబ్ధి కలిగిందన్నారు. అమ్మఒడి పథకాన్ని విమర్శించిన చంద్రబాబు ఇప్పుడు అదే పథకాన్ని కాపీ కొట్టి తల్లికి వందనం పేరుతో అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. కేవలం ఓట్ల కోసమే ఈ పథకాలను ప్రకటిస్తున్నారన్నారు. ఆయన మాటలు నమ్మితే మరో ఐదేళ్లు మోసపోతామన్నారు. నాలుగేళ్ల నుంచి ప్రకటించిన సంక్షేమ పథకాలను నిరాటంకంగా అమలు చేస్తున్నారన్నారు. అనంతరం ఆయన ఉపాధి కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకున్నారు. కూలీలకు గిట్టుబాటు అయ్యే వేతనాలను ఇవ్వడం జరుగుతోందన్నారు. గ్రామంలో జాబ్‌కార్డు కలిగిన వారందరికీ పనులు కల్పించాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరగా ప్రారంభించాలన్నారు. ప్రభుత్వం సిమెంట్, ఇసుక, ఐరన్‌ను సరఫరా చేస్తోందన్నారు. బిల్లు చెల్లింపులు కూడా సక్రమంగా సకాలంలో జరుగుతున్నాయన్నారు. ఎవరికీ ఎటువంటి మామూళ్లు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేర్చాలన్నాదే జగనన్న లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, సర్పంచ్ ఎరిపల్లి మునలయ్య, బీసీ సెల్ నాయకులు శీరం నర్సింహమూర్తి పార్టీనాయకులు ఎరిపల్లి శ్రీను, సూరాకాసుల గోవిందు, ఎంపీడీవో సీతారామరాజు, ఈవోపిఆర్‌డీ వెంకటనారాయణ, ఏఈ రాజు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోండి...



కోటవురట్లలోని లే అవుట్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ప్రత్యేకాధికారి ఉదయశ్రీ

కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలని మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ కోరారు. స్థానిక మహాలక్ష్మమ్మతల్లి ఆలయం సమీపంలోని వైఎస్సార్ జగనన్న కాలనీ లే అవుట్‌లో శుక్రవారం హౌసింగ్ డే నిర్వహించారు. కాలనీలో ఇంటి నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇంకా ఇళ్లు నిర్మించుకోని వారు వెంటనే ప్రారంభించాలని లేదంటే నోటీసులు ఇస్తారని పేర్కొన్నారు. ఇళ్లు నిర్మించుకునేందుకు ఇది మంచి అవకాశం అన్నారు. ప్రభుత్వమే స్థలం ఇచ్చి, నిర్మాణానికి కూడా రూ.1.80 లక్షలు ఆర్థిక సహాయం చేస్తోందన్నారు. ఇది కాకుండా డ్వాక్రా సంఘాలలో ఉంటే పావలా వడ్డీకి రూ.30 వేలు రుణం ఇస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, ఏవో చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ కరుణ, పీఆర్ జేఈ వర్మ, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్యామ్, సర్పంచ్ బి.అనిల్‌కుమార్, ఎంపీటీసీ వి.రాంబాబు, వలంటీర్లు పాల్గొన్నారు.

మత్స్యకారులకు అండగా జగనన్న ప్రభుత్వం



మోపెడ్ బళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : మత్స్యకారులను అన్ని విధాలా ఆదుకున్నది, వేట నిషేధ కాలంలో ఇచ్చే భృతి సక్రమంగా రూ.10 వేలకు పెంచి ఇచ్చిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డిదే అని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. కొరుప్రోలు క్యాంపు కార్యాలయం వద్ద మత్స్యకారులు ఏడుగురికి రాయితీతో కూడిన మోపెడ్ బళ్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం ద్వారా 60 శాతం రాయితీతో రూ.75 వేల విలువ చేసే మోపెడ్ స్కూటర్లను అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఉన్న మత్స్యకారులకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యకార సంఘ అధ్యక్షుడు మాతా గురునాథరావు, సర్పంచ్‌లు మల్లే లోవరాజు, చోడిపల్లి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మామిడి చంటి, పోలిశెట్టి పెద ఈశ్వరరావు, శీరం నరసింహమూర్తి, అద్దేపల్లి నూకునాయుడు, పినపాల గణేష్, వియ్యపు కనకారావు పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్లు

అచ్యుతాపురం(అనకాపల్లి): వినియోగదారులకు మెరుగైన బ్యాంకింగ్ సేవలందించేందుకు విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ ఎల్లప్పుడూ ముందుంటుందని కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ స్టాలిన్ అన్నారు. అచ్యుతాపురం ఎస్‌కేఆర్ రెసిడెన్సీలో శుక్రవారం అచ్యుతాపురం బ్రాంచ్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్లు స్టాలిన్, కామరాజు, జె.వి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ బ్యాంక్ సేవల గురించి వివరించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో చేసిన బ్యాంకింగ్ పనులు గురించి వివరించారు. ఈ నెల 25న విశాఖపట్నంలో నిర్వహించే విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ 108వ మహాజన సభకు సభ్యులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. జోనల్ మేనేజర్ పి.శివ ప్రకాశ్,మేనేజర్ ఎం.రామగణేశ్ పాల్గొన్నారు.

వ్యవసాయాధికారిగా మోహనరావు



యలమంచిలి: యలమంచిలి మండలం వ్యవసాయాధికారిగా పి.మోహనరావు యలమంచిలి వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.అల్లూరి సీతారామరాజు జిల్లా మంచంగిపుట్టు మండలం నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా యలమంచిలి వ్యవసాయాధికారిగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యలమంచిలి మండలంలో రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అందేలా చూస్తానని, ప్రజాప్రతినిధుల సలహాలతో వ్యవసాయాభివృద్ధికి తోడ్పడతానని తెలిపారు. మండలంలో రైతు భరోసా కేంద్రాల్లో పని చేస్తున్న వ్యవసాయ సహాయకులు, సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఎంపీపీ బోదెపు గోవింద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న ఏషియన్ పెయింట్స్ ప్రతినిధులు

రాంబిల్లి : పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని ఎంపీడీవో కె.ఎస్. కొండలరావు అన్నారు. ఏషియన్ పెయింట్స్ సౌజన్యంతో రాంబిల్లి, కృష్ణంపాలెం గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మొక్కలు నాటడమే కాకుండా మొక్కలు పంపిణీ చేశారు. ఏషియన్ పెయింట్స్ హెచ్‌ఆర్ సుజిత్, ఉదయ్‌కుమార్, హెచ్‌ఎం వేణుగోపాల్, ఈవోపీఆర్డీ రాజు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ వర్మ పాల్గొన్నారు.

విద్యా లక్ష్యాలు నిర్దేశించుకోవాలి



అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్

అచ్యుతాపురం (అనకాపల్లి) : మనం అభ్యసించే చదువు, పొందే డిగ్రీలు ఎన్ని ఉన్నప్పటికీ లక్ష్యాలను సరైన రీతిలో రూపొందించుకోవాలని సైన్స్ ఫర్ బెటర్ సొసైటీ లిమిటెడ్ ఎన్‌జీవోకు చెందిన సిహెచ్. జగదీష్ సూచించారు. అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా శుక్రవారం రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించిన జగదీష్ వ్యక్తిగత, సామూహిక విద్యా లక్ష్యాల గురించి ఆరా తీశారు. రాంబిల్లికి చెందిన ఉపాధ్యాయుడు కె.పి.రావు మాట్లాడుతూ ఉద్యోగ అన్వేషణకు తగ్గట్టుగా విద్యనభ్యసించాలని సూచించారు. గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక ఆలయ వార్షికోత్సవం



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బాబూరావు తదితరులు

నక్కపల్లి : ఉద్దండపురంలో వరసిద్ధి వినాయక ఆలయం మొదటి వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, రాష్ట్ర పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ తదితరులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామస్తుల విరాళాలతో మంచి ఆలయాన్ని నిర్మించడం పట్ల అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, మండల పార్టీ అధ్యక్షుడు పొడగట్ల పాపారావు, వైస్ ఎంపీపీలు ఈశ్వరరావు, నానాజీ సర్పంచ్ పొడగట్ల వెంకటేష్, ఎంపీటీసీ బచ్చలరాజు, పార్టీ నాయకులు శీరం నర్సింహమూర్తి, ఎస్.గోవిందు, తాతారావు, జి.గోవిందు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



యలమంచిలి తులసీనగర్‌లో ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

యలమంచిలి : పట్టణంలోని తులసీనగర్‌లో రోడ్డు విస్తరణలో భాగంగా శుక్రవారం రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను మున్సిపల్ అధికారులు తొలగింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా యలమంచిలి టౌన్ ప్లానింగ్ అధికారిణి శ్రీలక్ష్మి మాట్లాడుతూ తులసీనగర్ రోడ్డుకు ఇరువైపులా కొందరు ఆక్రమణలు చేపట్టారని, వీరికి గతంలో నోటీసులు జారీ చేసినా కొందరు స్పందించలేదన్నారు. దీంతో శుక్రవారం అధికారుల బృందంతో వెళ్లి పొక్లెయిన్‌తో ఆక్రమణలు తొలగించామన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



మెలిపాక దళితవాడలో మంచినీటి బోరు ప్రారంభిస్తున్న సర్పంచ్ భాస్కరరాజు

మునగపాక : తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మెలిపాక సర్పంచ్ అయినంపూడి విజయ భాస్కరరాజు కోరారు. కొంత కాలంగా మెలిపాక పంచాయతీ దళితవాడంలో కుళాయిల ద్వారా ఎరుపురంగులో నీరు రావడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే రమణమూర్తిరాజు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో సమస్య పరిష్కారానికి నిధులు మంజూరయ్యాయి. సంబంధిత నిధులతో బోరు ఏర్పాటు చేసి శుక్రవారం ప్రజలకు తాగునీరు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకున్నారు. వార్డు సభ్యులు గుబ్బల ఆనంద్,గుళ్ల పైడియ్య,పీఎంసీ చైర్మన్ నాగరాజు,ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుంట్ల శ్రీను పాల్గొన్నారు.

చిన్నారుల పట్ల శ్రద్ధ వహించండి

కోటవురట్ల: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల పట్ల శ్రద్ధ తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ సూచించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రం–5ను ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. రిజిస్టర్లు పరిశీలించి స్టాక్ తనిఖీ చేశారు. పిల్లల అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు. పిల్లలను ఎండల్లోకి వెళ్లకుండా చూసుకోవాలని సూచించారు.

11న 6వ తరగతిలో ప్రవేశాలకు పరీక్ష

మునగపాక : పాటిపల్లి మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశాలకు సంబంధించి ఈ నెల 11న ఎంట్రన్స్ పరీక్ష జరుగుతుందని ప్రిన్సిపాల్ పీపీఎస్ శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ స్కూల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్‌లను డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షకు హాజరుకావాలన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

మునగపాక : జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో మన్మథరావు కోరారు. మండలంలోని ఉమ్మలాడ జగనన్న కాలనీని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాతో పాటు ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం సాయం అందజేస్తుందన్నారు. ఆయన వెంట సర్పంచ్ గంగయమ్మ, ఈవోఆర్డీ ఈశ్వరరావు, నారాయణరావు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం



మునగపాకలో స్వామిని దర్శించుకుంటున్న గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్

మునగపాక: మునగపాక సంతబయిల అభయాంజనేయ స్వామి 25వ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి స్వామిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. రామ రామ హరేకృష్ణ 24 గంటల ఏకాహం నిర్వహించారు.దీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, సర్పంచ్ దిమ్మల అప్పారావు తదితరులు అభయాంజనేయ స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. నిర్వాహకులు కాండ్రేగుల మణికంఠ భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

మలేరియాపై అప్రమత్తత అవసరం



తిమ్మాపురం సచివాలయంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం

ఎస్.రాయవరం : దోమలు వ్యాప్తిని అరికట్టి మలేరియా నివారణకు కృషి చేయాలని హెల్త్ వెల్‌నెస్ సెంటర్ పర్యవేక్షకులు ఆమీర్ షాసిద్ సూచించారు. తిమ్మాపురం 2 సచివాలయంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించారు. పలువురు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సర్వసిద్ధి పీహెచ్‌సీ పరిధిలో మాసోత్సవాలు నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి 'జగనన్నకు చెబుదాం'

మునగపాక : ప్రజా సమస్యల పరిష్కారానికి జగనన్నకు చెబుదాం కార్యక్రమం దోహదపడుతుందని ఎంపీడీవో మన్మథరావు పేర్కొన్నారు. మునగపాక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు అర్జీదారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోలేని సమస్యలు ఈ కార్యక్రమం ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. చిన్న చిన్న తగాదాలకు సంబంధించి గొడవలు పడకుండా స్థానికంగా పరిష్కరించుకోవాలని సూచించారు. డీటీ వినయ్‌కుమార్, ఎస్‌ఐ మహమ్మద్ ఆలీ, ఈవోఆర్డీ ఈశ్వరరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

చెలరేగిన భానుడు

కోటవురట్ల: భానుడు నిర్దాక్షిణ్యంగా చెలరేగిపోయాడు. మంటలు పుట్టించి వడగాడ్పులతో ఉక్కిరిబిక్కిరి చేశాడు. మండుటెండలకు ఉక్కపోత తోడవ్వడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సూరీడు విజృంభించాడు. మధ్యాహ్నం 12 గంటలకు 42 డిగ్రీల ఉష్ణోగ్రతకు చేరడంతో రహదారులు నిర్మానుష్యంగా మారాయి. సాయంత్రం 6 గంటలైనా ఎండ తీవ్రత తగ్గలేదు.

క్లుప్తంగా

గురుకుల ప్రవేశాలకు గడువు ఈ నెల 12

అచ్యుతాపురం (అనకాపల్లి): గురుకుల విద్యాలయాల్లో ప్రవేశం కోరుతూ పరీక్ష రాసి సీటు పొందిన వారు ఈ నెల 12వ తేదీలోగా హాజరు కావాలని అచ్యుతాపురంలోని ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ పి.మధు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5,6,7,8వ తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించిన వారికి ఇప్పటికే ఎస్ఎంఎస్‌ల ద్వారా సమాచారం పంపించామని, ఈ నెల 12వ తేదీలోగా హాజరు కావాలని ఆమె సూచించారు.

చీమలాపల్లిలో సమగ్ర సర్వే ప్రారంభం



చీమలాపల్లిలో మ్యాప్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని చీమలాపల్లిలో శుక్రవారం సమగ్ర భూ సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మ్యాప్‌ను పరిశీలించి సర్వే పనులు రెవెన్యూ అధికారుల సమక్షంలో ప్రారంభించారు. సర్పంచ్ సియాద్రి నాగరాజు, ఎంపీటీసీ నాగిరెడ్డి నాగేశ్వరరావు, జాగారపు అప్పలనాయుడు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

లోఓల్టేజి సమస్యతో అవస్థలు

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో వినియోగదారులు లోవోల్టేజి సమస్యతో అవస్థలు పడుతున్నారు. శుక్రవారం పలు గ్రామాల్లో లోవోల్టేజి సమస్యతో పాటు పలు మార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. వడగాడ్పులతో సతమతమవుతున్న ప్రజలకు ఫ్యాన్‌లు, ఏసీలు పనిచేయక మరింత ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ శాఖ పలుచోట్ల జంగిల్ క్లియరెన్స్ పనులు చేయకపోవడంతో కొద్దిపాటి గాలికి సైతం చెట్లు కొమ్మలు విద్యుత్ తీగలకు తాకి సరఫరా నిలిచిపోతుందని వినియోగదారులు చెబుతున్నారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

రాంబిల్లి: దిమిలి శాఖా గ్రంథాలయంలో శుక్రవారం వేసవి విజ్ఞాన శిక్షణ కొనసాగింది. విద్యార్థులకు ఖోఖో, లిమన్ అండ్ స్పూన్ పోటీలు నిర్వహించారు. నీతి కథలు చెప్పారు. నీతి కథలో నీతిని గ్రహించి మంచి క్రమశిక్షణ అలవర్చుకొని బాగా చదువుకోవాలని లైబ్రేరియన్ శకుంతల సూచించారు.

అరట్లకోటలో మొబైల్ ఐసీటీసీ శిబిరం

పాయకరావుపేట : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో అరట్లకోట గ్రామంలో మొబైల్ ఐసీటీసీ క్యాంపు నిర్వహించి గ్రామస్తులకు హెచ్‌ఐవీ/ ఎయిడ్స్, టీబీ వ్యాధుల పైన అవగాహన కల్పించి ఉచితంగా 46 హెచ్‌ఐవీ రక్త పరీక్షలు చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రమేష్, సర్పంచ్ అప్పలనర్స, కార్యదర్శి విజయరాజు, మహిళా పోలీసు ఆదిలక్ష్మి, లింక్ వర్కర్స్ స్కీమ్ సూపర్‌వైజర్ రమణ, లింక్ వర్కర్ నర్సింగరావు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లో రుణాల పంపిణీ



రుణం అందిస్తున్న పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు

మునగపాక: సహకార సంఘ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మునగపాక పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు కోరారు. శుక్రవారం పీఏసీఎస్‌లో రూ.6 లక్షల మేర రుణాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో పాలన సాగుతుందన్నారు. రైతులకు అవసరమయ్యే రుణాలు అందజేస్తున్నామన్నారు. సీఈవో ఆదారి గోపాలరావు, సంఘ డైరెక్టర్ చక్రం,వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు బొడ్డేడ లిల్లీ పాల్గొన్నారు.